ఈ అభివృద్ధి.. గత వైభవమే



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ముఖద్వారం

- మున్సిపల్ స్టేడియంను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ హయాంలో రూ. 5.50 కోట్లతో ఎన్నో హంగుల ఏర్పాటు
- ఆ స్ఫూర్తిని కొనసాగించని ప్రస్తుత ప్రభుత్వం



చిన్నారుల ఆటవిడుపు కోసం పరికరాలు



మహిళల కోసం జిమ్



స్టేడియంలో అందంగా నిర్మించిన రోడ్డు



అందంగా తీర్చిదిద్దిన గ్యాలరీ



స్టేడియంలో పెవిలియం బాక్స్



క్రీడాకారులకు నెట్ ప్రాక్టీస్ సౌలభ్యం

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. ఇప్పటికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి వెలుగులే పాతనగరంలోని పలు ప్రాంతాల్లో మెరుపులీనుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా.. చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని స్థానికులు వాపోతున్నారు. ఒక వెలుగు వెలిగిన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం శిథిలావస్థకు చేరుకుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 5.50 కోట్లు వెచ్చించి గ్యాలరీలు, రహదారులు, పెవిలియన్, వెయిటింగ్ రూమ్‌లు, అత్యాధునిక మరుగుదొడ్లు, గ్రాస్, రంగులు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా జిమ్‌లు, చిన్నారులకు ఆట వస్తువుల వంటి అత్యాధునికి హంగులతో పునరాభివృద్ధి చేసింది. దీంతో మొత్తం స్టేడియం రూపురేఖలే మారిపోయాయి. గతంలోలా ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు నిర్వహించే స్థాయిలో స్టేడియంను అభివృద్ధి చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆ అభివృద్ధిని, నాటి ప్రాభవాన్ని కొనసాగించే రీతిలో స్పందించకపోవడం దురదృష్టకరమని పాతనగరవాసులు వాపోతున్నారు.

– జగదాంబ

కేంద్రం అసమర్థతే ఉక్కు నష్టాలకు కారణం

డాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వ అసమర్థతే విశాఖ ఉక్కు నష్టాలకు కారణమని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్టు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి, ఉత్తరాంధ్ర జోన్ ఇన్‌చార్జి లకే రాజారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ జరిగితే దానికి రాష్ట్రంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలే పూర్తి బాధ్యత వహించాలని, తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక అయిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయబోమని ప్రధాని మోదీ నుంచి తెలుగు ప్రజలకు స్పష్టమైన హామీని ఇప్పించే బాధ్యత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌దే అన్నారు. లేనిచో తెలుగు ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తే 50 వేల మంది కార్మికులకు ప్రత్యక్షంగా, 5 లక్షల మందికి పరోక్షంగా నష్టం జరుగుతుందన్నారు.

నష్టానికి గురయ్యే వారంతా బహుజన కుటుంబాలకు చెందిన వారేనని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ పేరిట మూసేసి రిజర్వేషన్లు లేకుండా చేయడమే ఈ ప్రభుత్వాల కుట్ర అని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ బీఎస్పీ చేపట్టిన బహుజన ధర్నాలో రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఉక్కు సంరక్షణ ఉద్యమంలో కార్మికులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వివేకానంద సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: ఉమ్మడి విశాఖ జిల్లా నర్సీపట్నం జి–కోడూరులో శుక్రవారం నల్ల మారమ్మ పండగ సందర్భంగా సంఘ సేవకుడు మళ్ల శివ సత్యనారాయణ జ్ఞాపకార్థం స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జి–కోడూరు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ జి–కోడూరులో స్వామి వివేకానంద విగ్రహాన్ని ప్రతిష్టించి, వివేకానంద ఆశయంతో మానవసేవే.. మాధవ సేవగా ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు పి. ఈశ్వర రావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన.. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు సిబ్బందిని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. ఎస్ఐ కె.ధర్మారావు, ఆర్ఎస్ఐ ఎస్.మురళీకృష్ణ, ఏఆర్ ఎస్ఐ (వీఆర్) కె.గురయ్యబాబు, హెచ్‌సీ ఆర్.ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సీపీ వారిని కుటుంబ సభ్యులతో సమావేశ మందిరానికి ఆహ్వానించారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు. సిబ్బందికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపి, వారి కుటుంబ సభ్యులు, ఉన్నతాధికారుల సమక్షంలో సన్మానించారు.

రైతుబజారులో 63 స్టాల్స్‌కు డ్రా

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం 63 రైతుల స్టాల్స్‌కు డ్రా తీశారు. ఉదయం రైతుల కార్డులు 90 రాగా, 63 స్టాల్స్‌కు డ్రా తీశారు. సాయంత్రం 63 స్టాల్స్‌కు 82 కార్డులు వచ్చినట్లు ఈవో కొండబాబు తెలిపారు. డ్రా తీసిన టోకెన్లను ఈవో రైతులకు అందజేశారు. ప్రతి శుక్రవారం రైతుల స్టాల్స్‌కు సంబంధించి డ్రా తీస్తున్నట్లు ఈవో తెలిపారు.

కార్మిక పక్షపాతి నండూరి



నండూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: సిటూ ఆంధ్ర రాష్ట్ర వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన నండూరి ప్రసాదరావు కార్మిక పక్షపాతిగా నిలిచారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, సిటు రాష్ట్ర నాయకుడు ఎం. జగ్గునాయుడు, రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు ఎ. అజశర్మ కొనియాడారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో నండూరి ప్రసాదరావు 23వ వర్ధంతి సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నండూరి ప్రసాదరావు విశాఖ జిల్లా కార్మిక వర్గ సమస్యలు పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. నాటి ఎమర్జెన్సీ కాలంలో అండర్ గ్రౌండ్‌లో ఉంటూ ఉద్యమాలు నడిచేలా గైడ్ చేసేవారన్నారు. సిటు ఏర్పాటు కాక ముందే కార్మిక వర్గ సమస్యలు అధ్యయనం చేయడంలో నండూరి దిట్ట అని తెలిపారు. షిప్‌యార్డ్, రక్షణ రంగం, బీహెచ్‌పీవీ, జింక్, జ్యూట్‌మిల్లుతో పాటు అసంఘటిత రంగ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు ఆయన నాయకత్వంలో జరిగాయన్నారు. సిటు సాధించిన విజయాలు చూసి కార్మిక వర్గం సిటూలో చేరి నేడు విశాఖలో 50 వేల సభ్యత్వంతో అగ్ర భాగాన నిలిచిందన్నారు. సిటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎం శ్రీనివాసరావు, పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కో కన్వీనర్ కేఎం కుమార మంగళం, జిల్లా కార్యదర్శి బి. జగన్, ఎం. సుబ్బారావు, జి. పోలేశ్వరరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీని ఆనుకుని టాయిలెట్ ఏర్పాటు



సీతారామచంద్రస్వామి ఆలయం ప్రహరీకి ఆనుకొని ఏర్పాటు చేసిన టాయిలెట్

డాబాగార్డెన్స్: ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికమే. ఓ వైపు సిరులతల్లి కనకమహాలక్ష్మి ఆలయం.. మరోవైపు పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం.. ఇంకో వైపు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ప్రాంగణం. దేవుడు ఎవరికైనా దేవుడే. నెల రోజుల పాటు కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అమ్మవారి ఉత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. అంత వరకూ బాగానే ఉంది. సాక్షాత్తు సీతారామచంద్రస్వామి వేంచేసిన ఆలయ ప్రహరీ వద్ద కనకమహాలక్ష్మి ఆలయానికి వచ్చే భక్తుల కోసం టాయిలెట్ ఏర్పాటు చేశారు. మరి కొందరు బహిరంగంగానే మూత్ర విసర్జన చేస్తూ.. పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రాలను అపవిత్రంగా రొచ్చు చేస్తున్నారు. ఇప్పటికైనా కనకమహాలక్ష్మి ఆలయ అధికారులు స్పందించి మూత్ర విసర్జనకు అడ్డుకట్ట వేసేలా అక్కడి నుంచి టాయ్‌లెట్ కేంద్రాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో దుష్ఫలితాలు



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు

మహారాణిపేట: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం జనవరి నుంచి పూర్తిగా నిలుపుదల చేయాలని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు కోరారు. శుక్రవారం ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మర పడవల యాజమానుల సంఘం కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జేడీ మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించరాదన్నారు. హార్బర్ పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగాన్ని నిర్మూలించడంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. చేపల వ్యాపారులు, బోటు యజమానులు విధిగా ఒక డబ్బా ఉపయోగించి చేపల వ్యర్థాలు, తెగిపోయి పాడైపోయిన వలలు, తాళ్లు డబ్బాలో వేసి హార్బర్‌లో గల డస్ట్‌బిన్‌లో పడేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల మత్స్య సంపద నశించడం, హానికర ఫలితాలను వివరించారు. వరల్డ్ వైడ్ ఫర్ నేచర్ ప్రతినిధి పి.హనీ సెలాస్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో బోటు యాజమానుల సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, నర్సింగరావు, మెరైన్ పోలీసు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎం.విజయకృష్ణ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.కృష్ణ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.రేవతి ఆశాజ్యోతి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి డి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ దుర్గా ప్రసాద్

సీతమ్మధార: ప్లాస్టిక్ నిషేధంపై సీతమ్మధార రైతు బజార్ వద్ద వినియోగదారులకు ఏఎంవోహెచ్ దుర్గాప్రసాద్ అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడడం వలన క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడతారన్నారు. తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఇచ్చి మన విశాఖపట్నంను సుందర నగరంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎవరూ ప్లాస్టిక్ సంచులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ సత్యనారాయణ, సచివాలయం సిబ్బంది, శానిటేషన్, మలేరియా సిబ్బందితో పాటు రైతుబజార్ ఈవో కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉమా నీలకంఠేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం



ఉమానీలకంఠేశ్వరుని జలంతో అభిషేకిస్తున్న అర్చకులు, భక్తులు

సీతమ్మధార: ఉమానీలకంఠేశ్వరునికి సహస్ర ఘటాభిషేకాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ముందుగా గణపతి పూజ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు 1008 బిందెల జలాలతో స్వామిని అభిషేకించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. బర్ల బాలకృష్ణ, బోర రవికుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గీతా మౌఖిక పోటీలు

డాబాగార్డెన్స్: వన్‌టౌన్‌లోని గీతా ప్రచార సమితి కార్యాలయ సమావేశ మందిరంలో డిసెంబర్ 1న భగవద్గీతలో గల 14వ అధ్యాయం గుణత్రయ విభాగ యోగంపై మౌఖిక పోటీలు నిర్వహించనున్నట్టు ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎవరైనా పాల్గొనవచ్చని, ఈ పోటీలు నాలుగు విభాగాలుగా జరుగుతాయన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అదే రోజున ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన కొందర్ని ఎంపిక చేసి తిరిగి 8వ తేదీన మౌఖిక పోటీలు నిర్వహించి ఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనదలిచే వారు కార్యదర్శి ఎం. వనజాదేవిని 7032662344, 9891784084 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు కమిషన్ రాక

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ శనివారం విశాఖ వస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసోత్సవాలపై సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిని సందర్శిస్తారు. అక్కడ పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తారు.

నేడు పార్థివ లింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం

అల్లిపురం: కార్తీక మాసం ఆఖరి రోజు ఆదివారం సాయంత్రం కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో శ్రీ పార్థివ లింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రముఖ శివ భక్తుడు పీల వెంకట అప్పలనాయుడు చేతులు మీదుగా జరిగే ఈ కార్యక్రమంలో కోటి దీపారాధన అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు.

స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సీపీ సన్మానం



స్నేక్ క్యాచర్ కిరణ్‌ను సన్మానిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం సన్మానించారు. గత నెల 8వ తేదీన పాత పోస్టాఫీస్ నుంచి ఒక మహిళ 112కు డయల్ చేసి 8 అడుగుల నాగుపాము ఇంట్లోకి ప్రవేశించిందని పోలీసుల సహాయాన్ని అర్థించింది. ఎస్ఐ లక్ష్మణ్‌రావు స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌ను సంప్రదించారు. వెంటనే కిరణ్ మహిళ ఇంటికి వెళ్లి ఆ పామును పట్టుకున్నారు. దీంతో కిరణ్‌కుమార్‌ను శుక్రవారం సీపీ సత్కరించారు.

ఎరుకుమాంబ ఆలయంలో దీపాలంకరణ



ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో దీపాలంకరణ

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి శుక్రవారం దీపాలంకరణ చేశారు. ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీమాతోనే ధీమా



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్

విశాఖ లీగల్: న్యాయవాదులకు బీమాతోనే ధీమా ఉంటుందని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఉదయం విశాఖ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. న్యాయవాదుల ఆర్థిక పరిపుష్టి కోసం బీమా అవసరమని చెప్పారు. ఇందుకు సంబంధించి నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులందరికీ మేలు చేకూరే విధంగా తమ కంపెనీ చేయూతనిస్తుందని ఆయన చెప్పారు. సంస్థ ప్రతినిధి అనిల్ కుమార్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా దేశంలో ఉన్న న్యాయవాదులు అందరికీ మేలు చేసే బీమా పద్ధతిని అమలు చేస్తున్నట్టు చెప్పారు. న్యాయవాదులు కేవలం రూ. 2,236 రూపాయలు చెల్లిస్తే తమ కంపెనీ ద్వారా 80 ఏళ్లు వచ్చే వరకు బీమా అమలులో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం కనీస ప్రీమియం చెల్లిస్తే మిగతా మొత్తాన్ని బార్ కౌన్సిల్ చెల్లిస్తుందన్నారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బేవరా సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదులందరూ బీమా పథకంలో సభ్యులుగా చేరాలని కోరారు. పథకం అందిస్తున్న సేవలను వివరించారు. 80 ఏళ్ల వరకు న్యాయవాదులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి. నర్సింగరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి డి. నరేష్ కుమార్, న్యాయవాదులు, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెరిగితేనే నియంత్రించవచ్చని ఎన్జీవో కో ఆర్డినేటర్ కె. ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏవీఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ యూనిట్లతో కలిసి శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు డిసెంబర్ 1న కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ఎయిడ్స్‌కు చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎం. రమేష్, మెడికల్ కౌన్సిలర్ బి. శైలజ, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, డీన్ జి. శంకరనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఎ. అర్చన, ప్రాజెక్ట్ మేనేజర్ వి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన మహిళ అరెస్ట్

అల్లిపురం: కొబ్బరితోట ప్రాంతంలో వరలక్ష్మీ చిట్టి, సంక్రాంతి చిట్టీలు, నెలవారి చిట్టీల పేరుతో లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన మహిళను టూటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్ ప్రాంతానికి చెందిన వంకా యర్రమ్మ స్థానికంగా నివసిస్తున్న మహిళల నుంచి వరలక్ష్మి వ్రతం, సంక్రాంతి, దసరా చిట్స్ పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.100 నుంచి రూ.300 వరకు వసూలు చేసింది. నెలవారీ చిట్టీల పేరుతో సుమారు రూ.40 లక్షల మేర వసూలు చేసి వారికి తిరిగి ఇవ్వకపోవటంతో వాసుపల్లి చెల్లయ్యమ్మతో పాటు మరి కొంత మంది టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసు, రవాణా శాఖ సిబ్బందికి డ్రైవింగ్‌లో శిక్షణ



మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

అల్లిపురం: పోలీసు, ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ సిబ్బందికి డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, డీటీసీ ఆదినారాయణ పాల్గొని శిక్షణ అందజేశారు. డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ వెంకట రెడ్డి, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అధికారులు హాజరయ్యారు.